# అబద్ధం

ఆరోజు ఆఫీసు లంచ్ టైంలో, అక్కడ పనిచేస్తున్న ఆడవాళ్ళంతా చాలా హడావిడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఏమిటో సందడని సుందరరామయ్య తన గదిలో నుంచి అక్కడికొచ్చాడు. బల్ల మీద రకరకాల రంగుల చీరలు పరచి ఉన్నాయి. ఒక నిమిషం అక్కడ నిలబడి తన గదిలోకి వచ్చేశాడు సుందరరామయ్య. ఓ పావుగంట అయ్యాక లలిత లోపలికొచ్చి పిన్నిగార్కి ఇది తీసుకోండి అంటూ ప్లాస్టిక్ కవర్లో వున్న ఓ చీర సుంద్రరామయ్య ముందు పెట్టింది. లలిత సుంద్రరామయ్య దూరపు బంధువు. చీట్లు కట్టడం, ఇన్‌స్టాల్‌మెంటులో చీరలు అమ్మడం ఎంతో ఉత్సాహంగా చేస్తుంది లలిత. ఎందుకో ఇన్‌స్టాల్‌మెంట్లో ఏ వస్తువూ కొనడం యిష్టం లేని సుంద్రరామయ్య వీటి జోలికి పోడు ఏనాడు.

"పిన్ని గార్కి బావుంటుంది తీస్కోండి" చీర వంక చూస్తోన్న అతనితో అంది లలిత. ఆఫీసులో హెడ్ గుమాస్తా ఐన సుంద్రరామయ్య అంటే చాలా మందికి అభిమానం, గౌరవం ఉన్నాయ్. "తీసుకోండి బాబాయ్ గారూ, ఏమిటి ఆలోచిస్తున్నారు" అంది లలిత మళ్ళీ.

'ఎంత'?

'మూడువేలు'

'ఏమిటి! మూడువేలా! వద్దులే' సుంద్రరామయ్య ఫైల్స్‌వైపు చూస్తుండటంతో లలిత కాసేపు అక్కడ నిలబడి వెళ్ళిపోయింది. సుంద్రరామయ్య కళ్ళ ముందు భార్య రత్నకుమారి కదలాడింది. ఒకసారి స్నేహితుని బలవంతం మీద అతనితో పాటు, సుంద్రరామయ్యా ఒక చీర కొన్నాడు. అది ఎర్రంచు ఆకుపచ్చ జరీచీర. తనకెంతో నచ్చింది. ఆ చీర చూసి భార్య కూడా మురిసిపోయింది. సాధారణంగా కట్టుడు చీరలు ఏవికొన్నా కట్టేసుకోకుండా బీరువాలో దాస్తుంది రత్నకుమారి. పెద్దాడబిడ్డ కూతురొచ్చిందనో, చిన్న తోటికోడలొచ్చిందనో ఆ సమయానికి యింట్లో వున్న చీర వెంటనే పెట్టేస్తుంది. ఈ చీర నువ్వే కట్టుకోవాలి అని గట్టిగా చెప్పి ఎర్రంచు ఆకుపచ్చ జరీ చీర భార్యకిచ్చాడు సుంద్రరామయ్య. వారం రోజుల తర్వాత ఆఫీసు నుంచి ఇంటికొచ్చే సమయానికి యింట్లో పెద్దకూతురు కనిపించింది. రెండు వీధుల వెనుక వుండే అమ్మాయి అమ్మ దగ్గరకు వస్తూ పోతూనే వుంటుంది. ఆరోజు కూతురు వైపు కొత్తగా చూస్తూ

"యిలాటి చీర నువ్వూ కొనుక్కున్నావా?" "అమ్మ చీరేయిది" అంది చీర అంచుల్ని చూసుకుంటూ అమ్మాయి.

సుందర్రామయ్య వెంటనే "అమ్మ చీర ఎప్పుడూ కట్టుకోవద్దు. ఇలాంటిదే ఇంకోటి కొనుక్కో లేదా మీ ఆయన చేత కొనిపించుకో" అంటూ విసవిసా లోపలి కెళ్ళిపోయాడు. అమ్మాయి ముఖం ముడుచుకుంది. వంటింట్లో ఉన్న తల్లి దగ్గరకు వచ్చి నీ చీర నువ్వు తీసేసుకో! అంది కోపంగా.

విషయం అర్థం అయిపోయిన తల్లి "మీ నాన్న మాటలు పట్టించుకోకు. అసలా చీర, ఆ రంగూ నీకే బావుంటుంది" అంది. ఆ చీర వదిలేసి వెళ్ళిపోతే తల్లి బాధ పడుతుందని పిల్లని చంకన వేసుకొని చకచక వెళ్ళిపోయింది కూతురు. ఆ సంఘటన సుందర్రామయ్యకి యిప్పుడు గుర్తొచ్చి నవ్వు తెప్పించింది.

అయితే. ఈ ఆఫీసులో పనిచేస్తున్న వారందరూ యింత ఖరీదైన చీరలు ఎందుక్కొంటారో అర్థం కాలేదు. మూడువేల రూపాయల చీర!! సుందర్రామయ్య మనస్సులో ఓ మెరుపు మెరిసింది. అంతలోనే రత్నకుమారి క్కూడా ఒకటి కొనాలి. తనూ కడతాడు ఇన్‌స్టాల్‌మెంట్స్. బెల్లు కొట్టగానే ప్యూన్ వచ్చాడు. లలితమ్మను పిలుచుకురా! అన్నాడు వెంటనే.

ఆ చీర లలిత తీసుకురావడం, సుందర్రామయ్య క్షణాల్లో తీసుకోవడం వెంటనే జరిగిపోయింది. అయితే అంత ఖరీదైన చీరంటే రత్నకుమారి ఇష్టపడదు. పొదుపుగా జాగ్రత్తగా సంసారం చేసే రత్నకుమారికి యిలాటి ఖర్చులు అనవసరంగా అన్పిస్తాయి.

సుందర్రామయ్య యింట్లో కొచ్చేసరికి వడియాలు పెట్టాలని బూడిద గుమ్మడికాయ తరుగుతోంది. "గబగబా చేతుకు కడుక్కురా, త్వరగా" అన్నాడు.
"ఏమిటా కంగారూ" అంది.
"ముందు రా, చెప్తాను!

రత్నకుమారి లోపలికెళ్ళి వచ్చేలోపు, ఆ మూడువేల రూపాయల చీర మడతలన్నీ విప్పేశాడు. ఆమె భుజాల చుట్టూ చీర చుట్టి

"ఎంత బావుందో! చీర కాదు, కట్టుకున్న నువ్వు" అన్నాడు చాలా సంతోషంగా. రత్నకుమారి భర్త సంతోషం కొంత అర్థం అయినా కొత్త చీర నలిగిపోతుందని కొంత బాధనిపించింది. నిజంగా ఆ పట్టుచీర తనకూ చాలా నచ్చింది. కానీ దాని ఖరీదెంతో! చీర జాగ్రత్తగా మడతపెడుతూ, 'ఎంతా?' అంది.

"ఎంతా పన్నెండు వందలు, నేను ఖరీదైన చీరలు కొంటానా?" అన్నాడు.

రత్నకుమారి చాలా ఆశ్చర్యం వేసింది. “యిది ఖచ్చితంగా 3వేలకు పైనే ఉంటుంది” అంది. 12 వందలే అన్నాడు సుందర్రామయ్య టి.వి చూస్తూ.

లలిత కుమారి పినతల్లి కూతురు సుందర్రామయ్య యింట్లో పక్క వాటాలో అద్దెకుంటుంది. ఆ వాటాలో వుండే జానకి, రత్నకుమారి మంచి స్నేహితులు. ఇద్దరూ కలిసి కూరగాయల మార్కెట్టుకి వెళ్ళడం, యిద్దరూ కలిసి సినిమాలకు వెళ్ళడం వాళ్ళకి బాగా అలవాటు. తెల్లవారి సుందర్రామయ్య ఆఫీసుకి వెళ్ళిపోయాక, రత్నకుమారి ఇంటికొచ్చింది జానకి. కొత్త చీర చూపిస్తూ 12 వందలట, ఎంత బావుందో అంది రత్నకుమారి.

“ఏమిటీ 12 వందలా?” విస్తుపోయింది జానకి.

అన్నయ్యగారితో చెప్పి నాకూ ఒకటి తెప్పించు అంది.

ఆ రాత్రి రత్నకుమారి భోజనాలు చేస్తూ “యిలాంటి చీరే జానకి కూడా తెచ్చి పెట్టమందండీ! 12 వందలూ నా చేతికిచ్చింది” అంది. సుందర్రామయ్యకు ముద్ద మింగుడు పడలేదు. ఆ మాటతో గబగబా మంచినీళ్ళు తాగి!

ఏమిటీ! మీ స్నేహితరాళ్ళకీ, మీ చుట్టాలకీ పక్కాలకీ నేను ఆఫీసు నుంచి చీరలు తెచ్చేవాడిలా కన్పిస్తున్నానా! అంటూ సుందర్రామయ్య గట్టిగా అరిచేసరికి, అంత కోపంగా ఎందుకు అరిచాడో రత్నకుమారికి అర్థం కాలేదు. ‘‘ఏదో! జానకి నాకూ తోడూ, నీడలా వుంటుందని...” నెమ్మదిగా ఏదో అనబోయింది రత్నకుమారి.

సుందర్రామయ్య ఒక్కసారిగి విరుచుకు పడ్డాడు. “నువ్వూ మీ జానకి తోడూ నీడైనా, ఈడూ జోడైనా నా కనవసరం. నేనేదో నా భార్యకు ఓ చీర కొనుక్కుంటే వూళ్ళో అందరికీ ‘అదే ఖరీదు’కి అలాటి చీరే తెమ్మనడంలో ఏమిటి నీ ఉద్దేశం.

అసలు నేను ఉద్యోగం చేస్తున్నానా, చీరల వ్యాపారం చేస్తున్నానా? మీ జానకికి నువ్వు చెప్తావా? నన్ను చెప్పమంటావా? యిలాంటి పనులు స్నేహితురాలి భర్తకి పురమాయించ కూడదని. అయినా నువ్వెందుకులే, నేనే చెప్తాను అంటూ గబగబా కంచంలోనే చేయి కడుక్కున్నాడు కోపంగా.

రత్నకుమారి భయపడిపోయింది. “వూర్కోండి మీరు, జానకి వింటే బావుండదు.” అంత కావాలనుకొంటే ఈ చీర తీస్కోమంటాను. మీరు యింకొకటి తెద్దురు కానీ.

సుందర్రామయ్యకి ఏం చెప్పాలో తోచలేదు. "నీకిది అలవాటేగా! అప్పుడు నేనెంతో యిష్టపడి తెచ్చిన చీర నీ కూతురికిచ్చేశావ్! యివ్వాళ ఈ చీర ఎవరికో యిచ్చేస్తానంటున్నావ్!" సుందర్రామయ్య రత్నకుమారి ముఖంలోకి చూస్తూ "అంటే మొగుడు తెచ్చిన చీర కట్టుకోవడం నీ కిష్టం లేదన్న మాట' ఇంకో ఇల్లాలైతే మావారు నాకోసం ప్రేమగా తెచ్చారని వూరందరికీ చెప్పి హాయిగా కట్టుకుంటుంది.

అసలు నాదే తప్పు. ఈ చీర రేపు వాపస్ యిచ్చేస్తాను."

కోపంగా వంటింట్లోంచి బయటికొచ్చిన సుందర్రామయ్య బెడ్‌రూంలోకెళ్ళి తనివి తీరా నవ్వుకున్నాడు. వంటింట్లో పనులు చేసుకుంటూ అనవసరంగా ఆయనను బాధ పెట్టానని చాలా పశ్చాత్తాప పడిపోయింది రత్నకుమారి.

ఇంటి ముందర రంగురంగుల రంగవల్లులతో బంతిపూల తోరణాలతో అందంగా వచ్చేసింది సంక్రాంతి. పట్టుచీర కాంతులు బుగ్గలమీద పడుతుంటే, ఎర్రని కుంకుమ నుదుటన మెరుస్తూ సంక్రాంతి లక్ష్మి లాగా కన్పిస్తోంది సుందర్రామయ్య కళ్ళకి రత్నకుమారి. ఇంత ఖరీదైన చీరని యిన్నేళ్ళ కాపురంలో ఆమెకి తను కొన్నది అదొక్కటే.

బొమ్మల పేరంటం ముగుస్తుంటే జానకి, లలిత రత్నకుమారి ఇంట్లోకి వచ్చారు, "చూశావా లలితా! ఈ చీర ఎంత బావుందో!" అంది జానకి.

"అవును! ఈమధ్య నేను చీరల బిజినెస్ చేస్తున్నాను. పిన్నిగారికి ఈచీరను కొనమని నేనే బాబాయ్ గారిని ఒప్పించాను" అంది లలిత.

అవునా! మరి నాకూ ఒకటి తీసుకురా! 12 వందలిస్తాను అంది జానకి వెంటనే.

లలిత పకపకా నవ్వి "12 వందలా" అంది

రత్నకుమారి, జానకి ముఖాలు చూసుకున్నారు.

"మూడువేలు"

"ఏమిటీ!" అన్నారు యిద్దరూ ఒకేసారి ఆశ్చర్యంగా!

"అవును! అసలు మూడువేల రెండొందలు. బాబాయ్ గారి కిస్తున్నానని రెండువందలు తగ్గించాను" లలిత అంటుంటే. "అబద్ధాలెందుకూ" అంది జానకి రత్నకుమారి వంక చూస్తూ.

పక్కగదిలో కట్టెను అటూ, యిటూ కదలడం రత్నకుమారి గమనించకపోనూ లేదు. గడియారం ఏడు గంటలు కొట్టింది. రత్నకుమారి ముసిముసిగా నవ్వుతూ "అబద్ధం ఎందుకూ" అంది.

"అవును! అబద్ధమే, మూడువేల రూపాయల చీరంటే నువ్వు కట్టుకోవని, అయినా నా భార్యకు కొనుక్కున్న చీర విషయం యింతమందికి సమాధానం చెప్పాల్సిన అవసరం వుందా?"

"ఇలాంటి అబద్ధాలు యిప్పుడే కనిపెట్టావ్! ఢిల్లీ నుంచి నీకోసం కొనుక్కొచ్చిన హ్యాండ్‌బ్యాగ్ ఆరువందలు. నీకు రెండువందలని చెప్పాను. ఇంకా విను. నీచేతికున్న ఈ బంగారు కంకణం 20గ్రాములని చెప్పాను. అది 30గ్రాములు. యిలాంటివి ఎన్నెన్నో..." 'ఎందుకిలాంటి అబద్ధాలు అన్నీ అనంటే... నా పిల్లల తల్లి, నా ధర్మపత్ని ఎప్పుడూ తనకు సంబంధించి, ఎప్పుడూ డబ్బు ఖర్చు పెట్టనీయదు కనుక. అందుకే యిలాటి అబద్ధాలు. యింకా ఎన్నో అబద్ధాలాడుతాను ముమ్ముందు."

రత్నకుమారి గలగలా నవ్వింది. ఇలాంటి అబద్ధాలే ఎప్పుడూ ఆడండి! భర్త కౌగిలిలో ఒదిగిపోయింది!!

ఇంటింటి చిత్రాలు - "మూసీ"

- సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక జూన్, జూలై 2000